విష్ణు నవ్వాడు.

"అది చాలా తెలివితక్కువ పని సురేష్ ! నడిరోడ్డు మీద చావు శత్రువుకి కూడా కోరకూడదు."

హఠాత్తుగా సురేష్ మెదడు పేలిపోయినట్లయింది. అద్భుతమయిన స్పార్క్-మెరుపులా పాకింది. వాళ్ళిక జన్మలో తన జోలికి రారు.

గట్టిగా నవ్వాడు సురేష్ .

"నన్ను చంపితే మీరందరూ జైలుకెళతారు, నువ్వూ, సహదేవ్, మాధురి, విక్కీ అందరూ."

విష్ణు అనుమానంగా చూశాడు.

"మేం ఏది చేసినా ఋజువులు దొరక్కుండా చేస్తాం సురేష్ ! నీకు తెలుసా విషయం! శరత్, వినయ్ ఉదాహరణలు చాలదా నీకు?"

జనం వాళ్ళను తోసుకుంటూ పోతున్నారు.

ఆడాళ్ళూ, పిల్లాపాపా, యువకులూ, వృద్ధులూ కొంపలు మునిగిపోతున్నట్లు బస్‌స్టాండ్‌లకూ, మార్కెట్‌కీ, ఇళ్ళకూ.

"అక్కడే మీకూ నాకూ తేడా వుంది విష్ణూ! నేనేం చేసినా ఋజువులతో చేస్తాను"

విష్ణుకతని మాటలు అర్థం కాలేదు.

కారు దగ్గరకొచ్చేశారు. కార్లో సహదేవ్ కూర్చుని వున్నాడు.

విష్ణు చేతిలో పిస్టల్ భుజానికి తగలటం తెలుస్తూనే వుంది సురేష్‌కి.

"అంటే?" అడిగాడు విష్ణు.

సహదేవ్‌కి కూడా వినిపించేట్లు గట్టిగా చెప్పాడు సురేష్ "నేను ఉద్యోగంలో కొచ్చిన దగ్గర్నుంచీ జరిగిందంతా వివరంగా స్టేట్‌మెంట్స్ రాసి మా స్నేహితులందరికీ పోస్ట్ చేశాను. ఈ ఉత్తరం అందిన వారం రోజులలోగా నేను వారిని కలుసుకుని నా క్షేమ సమాచారాలు తెలియజేయకపోతే వాళ్ళు ఆ స్టేట్‌మెంట్స్‌ని అన్ని పత్రికలకూ, పోలీస్ ఐ.జి. కి పంపిస్తారు. దాంతో మీరంతా అవుట్! జీవితాంతం జైల్లో మగ్గిపోయి-"

విష్ణు నిశ్చేష్టుడయ్యాడు. అతని చేతిలో పిస్టల్ జేబులో కెళ్ళిపోయింది. సహదేవ్ ముఖంలో మార్పులు స్పష్టంగా కనబడుతున్నయ్.

జనం వాళ్ళకు తగులుతూ గొడవ గొడవగా మాట్లాడుతూ, తోసుకుంటూ వెళ్తూనే వున్నారు. కొద్దిక్షణాలు విగ్రహాల్లా కదలిక లేకుండా నిలబడిపోయారు నలుగురూ.

సురేష్‌కి పూర్తి ధైర్యం వచ్చేసింది. తన ఉపాయం అద్భుతంగా, అమోఘంగా పనిచేస్తోంది. ఇంక తను వెనుకంజ వేయకూడదు.

"ఇది మీకో పాఠం మిస్టర్ సహదేవ్! తల తన్నేవాడొకడయితే తాడిని తన్నేవాడు ఇంకోడని చిన్నప్పుడే చదివాన్నేను. మీరు ఇప్పుడు నేర్చుకోబోతున్నారు."

సాయంత్రం అయిదున్నరయిపోయింది.

ఆఫీసుల్లోనుంచి జనం ప్రవాహంలా బయటికొస్తున్నారు.

అన్ని వేపుల్నుంచీ అన్నివేపులకూ... క్రిక్కిరిసిపోయి, కలగాపులగంగా నడుస్తూ...మాట్లాడుకుంటూ....

హఠాత్తుగా సురేష్ దృష్టి దూరంగా జనంలో కల్సిపోయి నవ్వుతూ తుళ్ళుతూ వస్తోన్న తులసి మీద పడింది ఆమె పక్కనే దీప.

ఆనందం పొంగిపొరలిందతనిలో. క్షణకాలం తనెక్కడుందీ, ఆమె ఎక్కడుందీ-ఏమీ తెలీటంలేదు. తనూ, తులసీ-ఇంకెవరూ కనిపించటంలేదు.

"హలో తులసీ!" పరుగుతో వెళ్ళి ఆమెను గాఢంగా కౌగలించుకున్నాడతను.

తులసి బిత్తరపోయి కెవ్వున కేకవేసింది కౌగిలి తప్పించుకుంటూ,

ఆమెను చూసి దీప కెవ్వుమంది.

క్షణాల్లో జనం మూగిపోయారు-ఈగల్లా ముసిరిపోతున్నారు.

"ఏమిటి? ఏం జరిగింది? ఏమయింది?" ప్రశ్నలు బాణాల్లా తగులుతున్నయ్. ట్రాఫిక్ ఆగిపోయింది.

ఆటోల హారన్లు, సైకిల్ బెల్లులు, కార్లు హారన్స్.

ఆ ప్రాంతమంతా రెండు క్షణలు చెవులు పగిలే శబ్దాలతో నిండిపోయింది.

"వీడెవడో నన్ను కౌగలించుకున్నాడు" జనంతో చెప్పిందామె.

మరుక్షణంలో జనం సురేష్ మీద పడ్డారు.

"క్యూంరే-అప్నే ఆఫ్‌కో హీరో సమజ్ రైక్యా?" ఓ గడ్డంసాయిబు అడిగాడు...సురేష్ కాలర్ పట్టుకుని.

"అట్లా అడిగితే ఏమ్ తెలుస్తాది భాయ్! నాలుగు దంచండ్రి!" ఇంకోడు వీపుమీద బలంగా పిడికిలి బిగించి కొట్టాడు.

సురేష్ వాళ్ళను లెక్కచేయటం లేదు.

"తులసీ! నేను సురేష్‌ని!" అన్నాడు ఆత్రుతగ.

తులసి అదిరిపడింది. ఆమెకు ప్రాణం లేచివచ్చినట్లయింది. అది సురేష్ గొంతే సందేహం లేదు. నూటికి నూరుపాళ్ళూనూ కానీ...కానీ అతను సురేష్ కాదు. అతని ముఖంవంక తేరిపార చూస్తోందమె.

ప్రత్యూష జనాన్ని తోసుకుంటూ ముందుకు రాబోయిందిగానీ సాధ్యం కావటంలేదు.

వందలు, వేలు గుమిగూడిపోతున్నారు జనం దానికితోడు ట్రాఫిక్‌జామ్!

"మారో సాలేకో!" కేకలు.

జనంలో ఉద్రేకం చెలరేగిపోతోంది.

ముఖం మీదా, వీపు మీద, పొట్టలో, దెబ్బలు పడిపోతున్నాయి. అతను తులసివేపే చూస్తున్నాడు.

"తులసీ-తులసీ-నా మాట విను-నేనంతా చెప్తాను."

అతని గొంతులో శక్తి తగ్గిపోతోంది. ముక్కులోనుంచీ, నోట్లోనుంచీ రక్తం, నీరసం శరవేగంతో ప్రవహిస్తోంది. ఇంకొద్ది క్షణాల్లో కిందపడిపోయేది ఖాయం. కళ్ళు మూసుకుపోతున్నాయి. అప్పుడు వచ్చాడు ఓ వ్యక్తి తూలుతూ, జనాన్ని తోసుకుంటూ ముందుకి.

లావుగా, పొడుగ్గా, బలిష్టంగా వున్నాడతను.

"ఏయ్-ఆపండ్రా నీ యవ్వ-ఆపండీ! స్టాపిట్-స్టాపిట్" ఆ గొంతు ఎక్కడో విన్నట్లుంది.

"అరె-నీక్కాదుబే చెప్పేది. చలో-అందరూ ఫోండి. ఊ-త్వరగా! వన్-టు-త్రీ-ఫోర్-ఫైవ్."

సురేష్ హృదయం ఆనందంతో పొంగిపోయింది.

ఆ గొంతు-అది-వాడు మరెవరో కాదు తన ప్రాణస్నేహితుడు కళ్ళు తెరచి డార్క్ డెవిల్ వంక ఆనందంగా చూశాడు అతను-

దెబ్బలు పడటం ఆగిపోయింది.

జనం పల్చబడిపోసాగారు. హారన్లు, కేకలు, సైకిల్ బెల్స్ కొట్టటం అంతా తగ్గిపోయింది. ట్రాఫిక్ మళ్ళా కదిలింది.

డార్క్‌డెవిల్ అతడిని లేపి భుజంమీద చేయివేశాడు.

"ఈ జనం వున్నారే-దొంగరాస్కెల్స్ బ్రదర్! ఎప్పుడు ఎవడి మీద పడతారో తెలీదు ఫర్‌గెటిట్! అందుకే మనం జనాన్ని కేర్ చేయకూడదు. మందుని కేర్ చేయాలి. కొంచెం కొడతావా?" జేబులోనుంచి బాటిల్ తీసి బలవంతంగా అతని నోట్లో కొంచెం బ్రాందీ  పోశాడు.

"ఒకే డార్క్ డెవిల్-నేన్రా! సురేష్‌ని" గుట్టుక్కున మింగుతూ మాట్లాడాడు సురేష్ .డార్క్‌డెవిల్ ఆశ్చర్యంగా చూశాడు.

"షటప్! నువ్వెవడో నాకు తెలీదు కానీ సురేష్‌వి మాత్రం కాదు. నేనెవరో నాకు తెలుసు-డార్క్‌డెవిల్.  మీ అర్జున్ గాడి మీద పగతీర్చుకున్న డార్క్‌డెవిల్. బాస్టర్డ్ నా ఆస్తి కాజేసి సుఖంగా బ్రతుకుదామనుకున్నాడు-నా చేతిలో చస్తే ఇంకా బాగుండేదిగాని తప్పించుకున్నాడు. నేను సృష్టించిన టెర్రర్‌తో వాడే గుండెపోటు వచ్చి చచ్చాడు తెలుసా?"

"ఇందాకే రేడియో న్యూస్‌లో చెప్పారు-ఇవాళ ఆ సందర్భంగా సెలబ్రేషన్ వుంది. నీ

పేరేంటో నాకు తెలీదు బ్రదర్-మా రూమ్ కెళ్ళి మందు కొడదాం పద."

"నేన్నాను" ఆగిపోయాడు సురేష్.

"నీ ఖర్మ! ఫో-ఓ హసీనా జుల్ఫోంవాలీ-జానేజహ..." పాడుకుంటూ వెళ్ళిపోయాడతను.

సురేష్ మళ్ళా నడవసాగాడు.

ఎదురుగ్గా విష్ణు నిలబడి వున్నాడు. కోపం ముంచుకొచ్చింది సురేష్‌కి.

"బాస్టర్డ్ నా ఎదుట్నుంచీ వెళ్ళిపో-లేపోతే నేనేం చేస్తానే నాకే తెలీదు."

జేబులో నుంచి పిస్టల్ తీసి పట్టుకున్నాడు.

విష్ణు భయపడిపోయాడు.

"తొందరపడకు సురేష్" అన్నాడు గాబరాగా!

జనం మూగసాగారు మళ్ళీ.

"షటప్! ముందు నా కళ్ళముందు నుంచి వెళ్ళిపో...ఒక్కనిమిషం టైమిస్తున్నాను."

విష్ణు జేబుల్లో చేతులుంచుకుని నడవసాగాడు.

"ఇదిగో-చూడు-"

విష్ణు ఆగాడు.

అతని దగ్గరకు నడిచాడు సురేష్ .

"ఇకనుంచీ నా జోలికి ప్రత్యూష జోలికి మీరు రాకూడదు. మేమూ మీ జోలికి రాము! జరిగిదంతా మీరూ, మేమందరం మర్చిపోదాం."

విష్ణు తల వూపాడు.

"ఇంక వెళ్ళు"

అతను వేగంగా అడుగులేసుకుంటూ వెళ్ళిపోయాడు.

*　　　*　　　*　　　*

తులసి మంచం మీద పడుకుని వుంది. గదిలో చీకటి అలుముకుంటోంది. ఆమె కొద్ది గంటల క్రితం జరిగిన సంఘటన గురించే యింకా ఆలోచిస్తోంది.

అతనెవరయి వుంటాడు?

అంతమంది జనంలో అంత ధైర్యంగా తననెలా కౌగిలించుకున్నాడు? మరి అతను సురేష్ కాకపోతే అతని గొంతు సురేష్ గొంతులా ఎలావుంది? ఆమెకంతా అయోమయంగా వుంది. ఆలోచిస్తున్న కొద్దీ బాధ ఎక్కువయిపోతోంది.

"తులసీ!" మళ్ళీ అదే గొంతు-సురేష్ గొంతు-

అదిరిపడి లేచి కూర్చుందామె.

ఎదురుగ్గా అతను-ఇందాక తనను నడిరోడ్ మీద-కౌగిలించుకున్న వ్యక్తి.

గొంతు-సురేష్‌ది.

"తులసీ! నేను నీ సురేష్‌నే తులసీ-నన్ను నమ్మలేవా?" అతి సమీపంగా వచ్చేశాడతను.

తులసి లేచి నుంచోబోయింది.

అప్పటికే ఆమెను మళ్ళీ కౌగిట్లో బంధించేశాడతను. అతని స్పర్శ అతడు కౌగిలించుకునే విధం అంతా అచ్చం సురేష్ లాగానే-

"తులసీ! నా దేవతా" చెవిలో రహస్యంగా-అంతా అదివరలాగానే-

పెదాలు కలుసుకున్నాయి-నాలుకలు కలబడుతూంటే..అనిపిస్తోంది.

సురేష్ .... సందేహం లేదు-సురేష్-సురేష్.

కానీ ఎలా సాధ్యం? సురేష్ ముఖం, రూపం-ఇలా ఎందుకుంటుంది! వదిలించుకోవాలని వుంది. దూరంగా జరగాలనీ అతని స్పర్శకు అందకూడదనీ-